# 1919




ఉర్దూ మూలం : సాదత్ హసన్ మంటో
తెలుగు అనువాదం : పుల్లూరి సంపత్‌రావు

**తమ్ముడూ, ఇది 1919కి సంబంధించిన గాథ.**

పంజాబ్ అంతా రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేసినప్పటి సంగతి. నేను అమృతసర్ గురించి మాట్లాడుతున్నాను. గాంధీని పంజాబ్‌లోకి ప్రవేశించకుండా భారత రక్షణ చట్టం కింద సర్‌మైఖేల్ డయ్యర్ నిరోధించారు. ఆయన ఇటు వైపు వస్తున్నప్పుడు పాల్వాల్ వద్ద ఆపి, అరెస్టు చూసి తిరిగి బొంబాయి పంపించారు.






బ్రిటీష్ వాళ్లు ఈ పొరపాటుచెయ్యకపోయి వుంటే భారతదేశంలో బ్రిటీష్ చీకటి చరిత్రలో భయంకర అధ్యాయమైన జలియన్ వాలాబాగ్ విషాదం జరిగేది కాదు.

ముస్లింలకు, హిందువులకు, సిక్కులకు అందరికీ గాంధీ పట్ల గొప్ప గౌరవం. అతన్ని అరెస్టు చేశారనే వార్త లాహోర్ చేరగానే అన్ని కార్యకలాపాలు ఆపేశారు. ఎక్కడి పని అక్కడే ఆగిపోయింది. అంతటా సంపూర్ణమైన హర్తాల్ పాటించారు. సమాచారం లాహోర్ నుంచి అమృత్‌సర్‌కు పాకింది. ఇక్కడ కూడా అప్పటికప్పుడే కార్యకలాపాలన్నింటిని ఆపేశారు. డా. సత్యపాల్‌ను, డా. కిచ్లూను నిర్బంధించమని ఏప్రిల్ 9 సాయంత్రం డిప్యూటీ కమీషనర్ ఉత్తర్వులు అందుకున్నారని తెలిసింది. ఆయన ఈ ఉత్తర్వులను అమలు పరచడానికి అనుకూలంగా లేరు. ఎందుకంటే ఆయన వుద్దేశంలో అమృత్‌సర్‌లో ప్రమాదకరమైన ఇబ్బంది ఏమీలేదు. ప్రజలు సమావేశాలవంటివి జరుపుకుంటున్నారు. అయితే శాంతియుత పద్ధతిలోనే జరుపుకుంటున్నారు. అలాంటి సమావేశాల వల్ల హింస తలెత్తే ప్రశ్నేలేదు. తొమ్మిదో తేదీన శ్రీరామనవమి ఉత్సవం. ఒక ఊరేగింపు జరిగింది.కానీ ఒక్క ప్రభుత్వ నిబంధనను కూడా ఉల్లఘించలేదు. కానీ తమ్ముడూ, సర్ మైఖేల్ అనేవాడు మెదడు లేని వాడు. మహాత్మాగాంధీ నిర్దేశకత్వంలో ఈ నాయకులందరూ బ్రిటీష్ పాలనను కూలదోస్తారనే ఒకే ఒక్క భయం అతన్ని వెంటాడింది. డా. సత్యపాల్‌ను, డా. కిచ్లూను నిర్బంధించారనే వార్త నిమిషాల్లోనే నగరమంతా దావానంలా వ్యాపించింది. ఏదో ఒక భయంకర విషాద సంఘటన జరగబోతోందని ప్రతి ఒక్కరూ భయపడ్డారు. అన్ని కార్యకలాపాలు ఆగిపోయాయి. నగరం శ్మశానంలాగ కనిపిస్తున్నది. ప్రజలు వేలాదిగా గుమిగూడి ఉత్తర్వులను రద్దు చేయమని డిప్యూటీ కమీషనర్ బహుదూర్ గారిని వేడుకోవడానికి బయలుదేరారు. కానీ తమ్ముడూ, అలాంటి విజ్ఞప్తులను మన్నించే కాలం కాదు. మెదడు లేని మృగం వంటి సర్ మైఖేల్ అధికారంలో వున్నాడు. ప్రజలు గుమిగూడడం చట్ట విరుద్ధం అని ప్రకటించాడు.

దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమృత్‌సర్ పట్టణ రక్షణ స్తూపంగా నిలిచింది. దాని ఛాతీపై జలియన్‌వాలాబాగ్ విషాదం అనే గాయం వుంది. చూడు, ఆ పట్టణం ఎలా అయిపోయిందో! అయితే ఇప్పుడు ఆ చీకటి కథను పక్కకు పెడదాం. అది బాధాకరమైన కథ. ప్రజలు ఏం చెప్పుకుంటున్నారంటే, ఐదు సంవత్సరాల క్రితం ఈ పవిత్ర పట్టణంలో ఏదైతే జరిగిందో అది బ్రిటీష్ వారి కారణంగానే జరిగింది. కానీ తమ్ముడూ, నిజం చెప్పాలంటే. అప్పుడు ఇక్కడ రక్తం పారడానికి మనమే బాధ్యులం. దాన్ని అలా వుంచుదాం...

డిప్యూటీ కమీషనర్ గారి బంగ్లా సివిల్ లైన్స్‌లో వుంది. బ్రిటీష్ పాలకులకు విధేయులైన ధనవంతుల ఉద్యోగుల ఇళ్లన్నీ అక్కడే వున్నాయి. నువ్వు అమృత్‌సర్ చూశావు. నీకు తెలుసు, అక్కడ సివిల్ లైన్స్‌ను పట్టణంతో కలిపే ఒక వంతెన వుంటుంది. ఆ వంతెన దాటగానే పాలకులు వాళ్ల కోసం కట్టుకున్న భూతల స్వర్గం మాల్‌ను చేరవచ్చు.

జన సమూహం హాల్ దర్వాజా వద్దకుచేరుకోగానే ఆ వంతెన దగ్గర గుర్రాలపై పోలీసులు ఆయుధాలతో మోహరించి వున్నట్లు తెలిసింది. ప్రజలు ఆగలేదు. తమ్ముడూ, వాళ్లు ముందుకు వెళ్లారు. వాళ్లలో నేనూ వున్నా. అందరూ నిరాయుధులే. ఏ ఒక్కరి దగ్గర కనీసం కత్తి కూడా లేదు. వాళ్లందరూ నగర ఉన్నతాధికారుల దగ్గర కేవలం నిరసన తెలియజేయడానికి డా. సత్యపాల్, డా. కిచ్లూను బేషరతుగా విడుదల చేయ్యమని కోరడానికే వచ్చారు. జన సమూహం వంతెన వైపు దూసుకెళ్లింది. వంతెన వద్దకు చేరగానే పోలీసులు కాల్పులు జరిపారు. అక్కడంతా తొక్కిసలాట జరిగింది. పోలీసు దళంలో కేవలం ఇరవై, ఇరవై ఐదు మంది మాత్రమే ఉన్నారు. మరో వైపు జన సమూహంలో మాత్రం వేలాది మంది వున్నారు. కాని తమ్ముడూ, బీభత్సం సృష్టించడానికి తుపాకులు వున్న రెండు డజన్ల మంది చాలు. అప్పుడు వెల్లువైన భయోత్పాతం ఊహకందనిది. కాల్పుల్లో కొంతమంది గాయపడ్డారు. ఆ వెంటనే జరిగిన తొక్కిసలాటలో మరి కొంత మంది గాయపడ్డారు. కుడివైపు మురికి కాలువ వుంది. ఒక్క తోపుతో నేను అందులో పడ్డాను. కాల్పులు ఆగిపోయాక నేను లేచాను. చూసేసరికి జన సమూహం అంతా వెళ్లిపోయారు. గాయపడ్డ వాళ్లు రోడ్డు మీద పడి వున్నారు. వంతెన మీద నిలుచున్న పోలీసులు నవ్వుతున్నారు. తమ్ముడూ, ఆ సమయంలో నా మానసిక పరిస్థితి ఏమిటో గుర్తులేదు. బహుశా ఇంద్రియాలపై నియంత్రణ కోల్పోయాను. నేను మురికికాలువలో పడిపోయాను. ఖచ్చితంగా స్పృహలో లేను. బయటకొచ్చాక జరిగినవన్నీ లీలగా నెమ్మదిగా గుర్తుకు తెచ్చుకున్నాను.

కొంత దూరంలో ప్రజలు ఆవేశంతో అరుస్తున్న శబ్దం వినిపిస్తున్నది. నేను పీర్‌కా తకియా గుండా మురికికాలువను దాటి హాల్ దర్వాజా దగ్గరకు వచ్చాను. దర్వాజా పైన వున్న గడియారాన్ని ముప్పై, నలభై మంది యువకులు కోపంతో పగలకొట్టడం నేనుచూశాను. గడియారపు డయల్ పగిలి అద్దం ముక్కలు నేలరాలడంతో అందులో ఓ యువకుడు తన సహచరులనుద్దేశించి '' ఇక రాణి విగ్రహాన్ని కూల్చేద్దాం పదండి'' అన్నాడు. ''వద్దు కొత్వాల్ విగ్రహాన్ని తగలబెడదాం'' అని మరొకడు అన్నాడు. ''బ్యాంకులను కూడా తగలబెడదాం'' అని మూడోవాడు అన్నాడు. వాళ్లను నాలుగోవాడు ఆపి ''అలా చేయడం వల్ల ఏం ప్రయోజనం? వెళ్ళి వంతెన మీదున్న పోలీసుల్ని చంపుదాం పదండి'' అన్నాడు.

నేను అతన్ని గుర్తుపట్టాను. అతని పేరు మొహమ్మద్ తుఫేల్. అయితే అతను మాత్రం తాయిలా కంజేర్‌గానే తెలుసు. ఎందుకంటే అతను ఓ వేశ్యకు జన్మించాడు. అతనో దుర్మార్గుడు చిన్నప్పటి నుంచి తాగుడు, పేకాటకు బానిస అయ్యాడు. అతని చెల్లెళ్ళు సంషాద్, అల్మాస్ ఇద్దరూ ఆ కాలంలో అత్యంత అందమైన నాట్యగత్తెలు. షంషాద్‌ది శ్రావ్యమైన గొంతు. ఆమె కచేరీలకు సుదూర ప్రాంతాల నుంచి రాజకుటుంబీకులు వచ్చేవారు. వాళ్లన్నయ్య చేష్టలతో ఆ ఇద్దరు విసిగివేసారిపోయారు. వాళ్లు అతనితో అన్ని రాకల సంబంధాలను తెగదెంపులు చేసుకున్నారనేది నగరంలో అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటికీ అతను ఏదో ఒక వంక తన అవసరాలను తీర్చుకోవడానికి వాళ్ల దగ్గర నుంచి డబ్బులు పిండుతూనే వున్నాడు. అతను బాగానే బతికాడు. జోకులుచెప్పడంలో దిట్ట. నాట్యకత్తెల కచేరీల దగ్గర వుండే వాయిద్యకారుల సాహచర్యానికి కూడా అతను దూరంగా వుండేవాడు. అతను ఎత్తుగా బలిష్టంగా తీక్షణమైన చూపులతో వుంటాడు.

ఆ యువకులు అతని మాటలు వినకుండా రాణి గారి విగ్రహం వైపు కదిలారు. అతను మళ్లీ వాళ్లకు చెప్పాడు. ''మీ శక్తిని వృథా చేయకండి. నాతో రండి. వెళ్లి పోలీసుల్ని చంపుదాం. వాళ్లు అమాయకులను గాయపరిచారు. చంపేశారు. దేవుని దయవల్ల మనం వాళ్ల కంటే ఎక్కువ మందిమే వున్నాం పదండి''

కొంతమంది అప్పటికే వెళ్లిపోయారు. మిగతా వాళ్లు ఆగారు. ఎప్పుడైతే తాయిలా వంతెన వైపు కదిలాడో అప్పుడు వాళ్లు అతన్ని అనుసరించారు.

''ఈ యువకులు చావును ఆహ్వానిస్తున్నారని'' నేను అనుకొన్నాను. నేను ఫౌంటేన్ పక్కన దాక్కుని

వున్నాను. అక్కడి నుంచే తాయిలాను ఉద్దేశించి గట్టిగా అరిచాను. ''దయచేసి వెళ్లకండి. మీరు తెగించి వీళ్ల ప్రాణాలను ఎందుకు తీస్తారు?''

ఇది వినగానే తాయిలా వికటహాసం చేసి తిరిగి అరిచాడు. ''తాయిలా తుపాకీ గుళ్లకు భయపడే వాడు కాదు అని చూపించేందుకే తెగిస్తున్నాను'' అతను తన అనుచరుల వైపు తిరిగి ''మీకు భయమైతే వెనక్కి వెళ్లవచ్చు'' అన్నాడు.

అలాంటి స్థితిలో ముందుకు పడుతున్న అడుగులు వెనక్కి ఎలా వెళతాయి? మరీ ముఖ్యంగా ముందుండి నడిపిస్తున్న నాయకుడు ప్రాణత్యాగానికి సిద్ధంగా వున్నప్పుడు. తాయిలా వేగంగా కదిలాడు సహచరులు అతన్ని అనుసరించారు.

హాల్ దర్వాజాకు వంతెనకు మధ్య పెద్ద దూరం లేదు. అది అరవై, డెబ్బై అడుగుల కంటే ఎక్కువ వుండదు. సమూహాన్ని తాయిలా నడిపించాడు. వంతెన ప్రారంభంలో ఇద్దరు పోలీసులున్నారు. తాయిలా ఆ పరిసర ప్రాంతానికి చేరుకొని నినాదాలు చేస్తూ అరవగానే కాల్పులు జరిగాయి. నేననుకోవడం తాయిలా పడిపోయాడు. అయితే అతను ప్రాణాలతోనే ఉన్నాడు. అతని అనుచరులు భయంతో పరిగెత్తారు. అతను వారి వైపు తిరిగి ''రండి పరుగెత్తవద్దు'' అని అరిచాడు.

అతని ముఖం నా వైపు వుంది. మళ్లీ కాల్పులు జరిగాయి. అటువైపు తిరిగి అతను పోలీసుల్ని చూశాడు. అప్పుడు చూశాను. అతని తెల్లని చొక్కా అంతా రక్తపు మరకలే. గాయపడ్డ పులిలాగా ముందుకు దూసుకెళ్లాడు. అప్పుడు మళ్లీ కాల్పులు జరిగాయి. అతను పడిపోబోయి నిలదొక్కుకొని గుర్రంపై వున్న పోలీసును ఆసరాగా పట్టుకున్నాడు. రెప్పపాటులోనే గుర్రం పైన వున్న పోలీసును కిందపడేసి తాయిలా అతనిపై కూర్చున్నాడు. దానికి దగ్గరలోనే గుర్రంపై వున్న మరో పోలీసు మొదట చూసి ఆశ్చర్యపోయి తన గుర్రాన్ని నిలకడగా వుంచి కాల్పులు మొదలుపెట్టాడు. తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను ఫౌంటేన్ దగ్గరే అపస్మారక స్థితిలో పడిపోయాను. నాకు తెలివొచ్చేసరికి మా ఇంట్లో వున్నా. తెల్సిన వాళ్లెవరో నన్ను మా ఇంటికి చేర్చారు. కాల్పుల తర్వాత వంతెన దగ్గర ప్రజలు చెల్లాచెదురయ్యారు. అయితే రాణిగారి విగ్రహాన్ని కూల్చే ప్రయత్నం జరిగింది. మూడు బ్యాంకులను, టౌన్ హాల్‌ను తగులబెట్టారు. ఇంకా ఐదారుగురు బ్రిటీష్ వాళ్లని చంపేశారని వాళ్ల ద్వారా నాకు తెలిసింది. పెద్ద ఎత్తున లూటీ కూడా జరిగింది.

బ్రిటీష్ అధికారులు లూటీ గురించి ఆందోళన చెందలేదు. యూరోపియన్ల చావుకు ప్రతీకారంగా ఈ ఘోరమైన జలియన్ వాలాబాగ్ దురంతానికి ఒడిగట్టారు. డిప్యూటీ కమీషనర్ బహదూర్ గారు పరిపాలనను జనరల్ డయ్యర్‌కు అప్పగించారు. ఏప్రిల్ 12వ తేదీన జనరల్ గారు నగరంలోని వీధుల గుండా సైనికులతో ఓ కవాతు నిర్వహించి డజన్ల కొద్దీ అమాయకులను అరెస్టు చేశారు. 13వ తేదీన జలియన్ వాలాబాగ్‌లో ఓ సమావేశాన్ని నిర్వహించారు. దాదాపు ఇరవై ఐదు వేల మంది దానికి హాజరైనారు. సాయంత్రం అక్కడకు జనరల్ డయ్యర్ ఆయుధాలు ధరించిన పోలీసులతో వచ్చి నిరాయుధులైన సమూహంపై కాల్పులు ప్రారంభించాడు.



షంషాద్ పొడవుగా మంచి లక్షణాలతో మత్తు కళ్ళతో ఉంటుంది. ఠుమ్రీలు పాడటంలో ఆమె నిష్ణాతురాలు. మరో అమ్మాయి అల్మాస్ మూగది. అయితే ఆమె అద్భుతమైన నాట్యగత్తె. ఆమె నృత్యం చేస్తుంటే ఆమెలోని ప్రతి అణువు జీవంతో తొణికిసలాడు తుంది. ఆమె ప్రతి కదలిక అతిథులను రసజ్ఞతలో పడేస్తుంది. ఆమె కళ్ళలో అందరిని ఆకట్టుకునే మంత్రం వుంది.

ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో ఆ సమయంలో ఎవరూ లెక్కపెట్టలేదు. దాదాపు వెయ్యి మంది చనిపోయినట్లు మరో మూడునాలుగు వేల మందికి గాయాలైనట్లు ఆ తర్వాత విచారణలో తేలింది. కానీ తమ్ముడూ, నేను మాట్లాడుతున్నది తాయిలా గురించి. స్వయంగా నా కళ్లతో చూశాను. నిందలేని వాడు ఒక్క దేవుడు మాత్రమే. అన్ని దుర్గుణాలు చనిపోయినతనికి వున్నాయి. అతను ఓ వేశ్యకు జన్మించిన వాడు. కానీ అతను ధైర్యం గలవాడు. పోలీసు కాల్చిన మొదటి తూటా కూడా అతనికే తాకిందని నేనిప్పుడు నమ్మకంగా చెప్పగలను. తన అనుచరుల ధైర్యాన్ని పెంచేందుకు ఇటు వైపు తిరగగానే కాల్పుల శబ్దం వినిపించింది ఆ క్షణం తెలియలేదు కానీ ఓ సీసపు తూటా అతని ఛాతిలోకి చొరబడింది. నేను దాన్ని చూడలేదు. అయితే పోలీసు మృతదేహం నుంచి తాయిలా మృతదేహాన్ని వేరు చేసినప్పుడు విన్నాను. తాయిలా రెండు చేతులు పోలీసు గొంతును ఎంత గట్టిగా బిగుసుకున్నాయంటే ఆ రెండు శరీరాల్ని సులభంగా వేరు చేయలేకపోయారు. ఆ పోలీసతన్ని తాయిలా గొంతు నులిమి చంపేశాడు.

మరుసటి రోజు తాయిలా మృతదేహాన్ని పూడ్చడం కోసం అతని కుటుంబ సభ్యుల కిచ్చేటప్పుడు అదంతా తూటాలతో నిండి వుంది. రెండో పోలీసు తన రివాల్వర్‌లోని తూటాలన్నింటిని తాయిలాపై కాల్చాడు. బహుశా అతను అప్పుడే చనిపోయి వుంటాడు. ఆ రాక్షసుడు రైఫిల్ ప్రాక్టీసును ఆ మృతదేహంపై చేశాడు.

తాయిలా మృతదేహం మొహల్లా చేరగానే అక్కడి వారి ఏడ్పులు ఆకాశాన్ని అంటాయి. అతను అక్కడ ప్రజాదరణ గల వ్యక్తి ఏమీ కాదు కానీ అతని తూటాలు నిండిన శరీరాన్ని చూడగానే ప్రతి ఒక్కరూ బాధతో ఏడ్చారు. అతని చెల్లెళ్లు షంషాద్, అల్మాస్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అంతిమ సంస్కార యాత్ర ప్రారంభం కాగానే ప్రతి ఒక్కరి కళ్లలో బాధ రక్త కన్నీరై కారింది.

తమ్ముడూ ఫ్రెంచి విప్లవంలో కూడా మొదటి తూటా ఇలాంటి వ్యక్తిపైనే పడ్డట్టు నేనెక్కడో చదివాను. చనిపోయిన మొహమ్మద్ తుఫేల్ ఓ వేశ్య కొడుకు. సమాజంలో పేదవానికి హోదా లేకపోవడం వల్ల అతనికి తగిలిన మొదటి తూటా నిజంగా మొదటిదా, పదోదా లేక పదిహేనవదా అనే విషయాన్ని ఎవరూ పట్టించుకుని విచారణ చెయ్యలేదు. బహుశా పంజాబ్ రక్తపాతానికి సంబంధించిన అమరవీరుల జాబితాలో తాయిలా కాంజేర్ పేరు కనపడక పోవచ్చు. అసలు అలాంటి జాబితా ఒకటి తయారు చేశారా అన్నది కూడా తెలియదు.

''అవి చాలా అల్లకల్లోలపు రోజులు. సైనిక పాలన అమలులో వుంది. మార్షల్ లా అనే దెయ్యం చావును ఆరగిస్తూ ఒంటి కాలుతో వీధులు తిరుగుతున్నది. ఏదో పాపం చేసి చనిపోతే బంధువులందరు ఆ చావేదో పెద్ద నేరం అయినట్టు భావించి ఆనవాళ్ళు లేకుండా ఆదరాబాదరాగా పూడ్చేసినట్టు ఆ పేదవాన్ని పూడ్చేశారు. సరే తమ్ముడూ, తాయిలా చనిపోయాడు. తాయిలాను పూడ్చేశారు.

అలా అంటూనే నా తోటి ప్రయాణికుడు ఆ కథను కొనసాగించడానికి మొదటిసారిగా సందేహిస్తూ ఆ తర్వాత మౌనం వహించాడు. రైలు వేగంగా వెళుతున్నది. రైలు పట్టాల నుంచి వస్తున్న శబ్దం ''తాయిలా చనిపోయాడు.. తాయిలాను పూడ్చేశారు'' అంటూ ప్రతిధ్వనిస్తున్నట్లు అనిపిస్తున్నది. ఆయన చావును, పూడ్చేయడాన్ని వేరుచేయడానికి మధ్య ఏమీ లేదు. ఆ ఘటనలో చనిపోయాడు. మరో ఘటనలో పూడ్చేయబడ్డాడు. ఆ పదాలు రైలు పట్టాల నుంచి ఎంత భావోద్వేగంతో పునరావృతం అవుతున్నాయంటే నేను వాటిని నా తలలోకి వెళ్ళకుండా నిరోధించాల్సి వచ్చింది. అందువల్ల నేను నాతోటి ప్రయాణికుడితో ''మీరింకా మరేదో చెప్పబోతున్నారు'' అన్నాను.

, ఆయన నావైపు ఆశ్చర్యంగా చూసి ''ఈ కథకు మరో విషాదకర అధ్యాయం ఉంది'' అన్నాడు. అతను ప్రారంభించాడు.

తాయిలాకు షంషాద్, అల్మాస్ అని ఇద్దరు చెల్లెళ్ళు వున్నారని నేను ఇంతకుముందే చెప్పాను. చాలా అందమైన అమ్మాయిలు. షంషాద్ పొడవుగా మంచి లక్షణాలతో మత్తు కళ్ళతో ఉంటుంది. ఠుమ్రీలు పాడటంలో ఆమె నిష్ణాతురాలు. మరో అమ్మాయి అల్మాస్ మూగది. అయితే ఆమె అద్భుతమైన నాట్యగత్తె. ఆమె నృత్యం చేస్తుంటే ఆమెలోని ప్రతి అణువు జీవంతో తొణికిసలాడుతుంది. ఆమె ప్రతి కదలిక అతిథులను రసజ్ఞతలో పడేస్తుంది. ఆమె కళ్ళలో అందరిని ఆకట్టుకునే మంత్రం వుంది.

నా తోటి ప్రయాణికుడు ఆ అమ్మాయిల్ని అవసరానికి మించి పొగిడాడు గాని నేను జోక్యం చేసుకో

వడం సరైంది కాదని భావించాను. ఆ తర్వాత ఆ జ్ఞాపకాల నుంచి వాస్తవ ప్రపంచంలోకి వచ్చి కథకు సంబంధించిన విషాద భాగాన్ని చెప్పడం ప్రారంభించాడు. ''తమ్ముడూ, ఎవడో ఓ ధూర్తుడు ఈ అమ్మాయిల అందం గురించి సైనికాధికారులకు చెప్పాడు. అల్లర్లలో మిస్ షేర్‌వుడ్ అనే ఆంగ్లేయ వనిత చనిపోయింది. ఈ అమ్మాయిలను పిలిపించి శ్వేత జాతి స్త్రీ చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించారు. నా ఉద్దేశం నీకు అర్థం అయిందనుకుంటాను. కాలేదా? నా తోటి ప్రయాణికుడు ఓ దీర్ఘ శ్వాస వదిలాడు. ఎవరైనా వాళ్ళవాళ్ళ తల్లులకు చెల్లెళ్ళకుగౌరవం ఇచ్చినట్లుగానే ఇలాంటి సున్నిత విషయాలలో నాట్యగత్తెలు, వేశ్యలు కూడా గౌరవాన్ని కోరుకుంటారు. కాని ఈ దేశం అలాంటి వాటన్నింటిని కోల్పోయింది. పైఅధికారుల నుంచి ఆజ్ఞలు పొందగానే ఇలాకా తానేదార్ ఆ అమ్మాయిలను తీసుకురావడానికి ఒప్పుకున్నాడు. అతనే స్వయంగా షంషాద్, అల్మాస్ వాళ్ళింటికి వెళ్ళి ''అధికారులు మిమ్మల్ని కావాలన్నారు. వాళ్ళు మీ ప్రవర్తన చూడాలనుకుంటున్నారు'' అని చెప్పాడు. వాళ్ళ అన్నయ్య సమాధి భూమ్మీద ఇంకా పచ్చిగానే ఉంది. అతను చనిపోయి ఇంకా రెండు రోజులు కూడా గడవకముందే ప్రదర్శన ఇవ్వమని ఆజ్ఞలు జారీచేశారు. ఇంతకుమించిన అవమానం ఏం కావాలి? బహుశా అలాంటి క్రూరమైన బుద్ధిలేని ఘటన మరోటి ఉండదు. నాట్యగత్తెకు కూడా ఆత్మాభిమానం వుంటుందని ఆజ్ఞలు జారీచేసిన వాళ్ళకు తెలియదా? ఎందుకు తెలియదు? తనకు తానే ప్రశ్నించుకుంటున్నాడు. అయితే నన్నుద్దేశించి అంటున్నాడు. ''అవుననుకో, ఆమెకూ ఆత్మాభిమానం ఉంటుంది'' అన్నాను. అవునన్నాడు. ఎంతైనా తాయిలా వాళ్ళన్నయ్య. 'అతను సారా దుకాణంలో పోట్లాడి ప్రాణాలు కోల్పోలేదు. మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేశాడు. అతను వేశ్య కొడుకే కావచ్చు. కాని ఆమె కూడా ఒక అమ్మే! షంషాద్, అల్మాస్ ఆ తల్లికి కూతుళ్ళు, తాయిలాకు చెల్లెళ్ళు. అతని మృతదేహం చూడగానే వాళ్ళు మూర్ఛపోయారు. అతని అంతిమ సంస్కార సమయంలో వాళ్ళ ఏడ్పులు ఆకాశాన్ని అంటాయి. ''వాళ్ళు వెళ్ళారా?'' అనడిగాను. నా తోటి ప్రయాణికుడు కొంచెంసేపాగి ''అవును వెళ్ళారు. వాళ్ళు మంచి దుస్తులు ధరించి వెళ్ళారు'' అని విచారంగా బదులిచ్చాడు. అలా చెప్తుండగానే అతని విషాదం ఎక్కువైంది.

ప్రదర్శనకు కావలసిన పూర్తిస్థాయి అలంకరణతో వాళ్ళు వెళ్ళారు. ఆ సాయంత్రం ఇచ్చిన ప్రదర్శన అత్యద్భుతంగా విజయవంతం అయింది. ఇద్దరు అక్కాచెల్లెళ్ళు అవధులు లేని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. రంగురంగుల దుస్తుల్లో వాళ్ళు దేవదూతలను తలపించారు. మద్యం ఏరులైపారింది. వాళ్ళు ఆడారు. పాడారు. దాదాపు రెండు గంటల రాత్రపుడు ఉన్నతాధికారి సూచన మేరకు విందు ముగిసింది.

నా సహచరుడు లేచి నిలబడి బయట పరుగెత్తుతున్న చెట్లవైపు చూడటం ప్రారంభించాడు. రైలు పట్టాలకు, చక్రాలకు మధ్య నుంచి వచ్చే శబ్దాలకు అనుగుణంగా ''విందు ముగిసింది.... విందు ముగిసింది'' అనే అతని చివరి రెండు పదాలు నాట్యం చేస్తున్నాయి. ఆ శబ్దాల నుంచి వస్తున్న మాటలను తుంచేసి ''ఆ తర్వాత ఏమైందని'' అతన్ని అడిగాను.

అతని దృష్టిని పరుగెత్తుతున్న చెట్ల నుంచి స్తంభాల నుంచి మళ్ళించి భావోద్వేగంతో చెప్పాడు.

వాళ్ళు మిరుమిట్లు గొలిపే రంగురంగుల దుస్తుల్ని వొంటి నుంచి తొలగించి నగ్నంగా నిలబడ్డారు. ప్రదర్శనకు వచ్చిన వాళ్ళనుద్దేశించి ''బాగా చూడండి, మేం తాయిలా చెల్లెళ్ళం. అతని అందమైన శరీరం నిండా మీరు తూటాలు కురిపించారు. ఎందుకంటే అతను ఈ దేశాన్ని ప్రేమించాడు. అదే వ్యక్తికి మేం అందమైన చెల్లెళ్ళం. రండి. అత్తరు చల్లిన మా అందమైన శరీరాలతో మీ కామం తీర్చుకోండి. కాని దానికి ముందు మీ ముఖంపై ఉమ్మి వేయనీయండి'' అని షంషాద్ అన్నది.

ఇంకా చెప్పటానికి ఏం లేదన్నట్టుగా అతను నిశ్శబ్దంగా ఉన్నాడు. నేనతన్ని ఆ తర్వాత ఏమైందని అడిగాను. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ''వాళ్ళను కాల్చి చంపేశారు'' అని బదులిచ్చాడు. నేనేం మాట్లాడలేదు. రైలు నిదానం అయి స్టేషన్లో ఆగింది. అతను కూలీవాణ్ణి పిలిచి సామాను తెమ్మన్నాడు. అతను వెళ్ళిపోబోతుండగా ''ఇందాక చెప్పిందానికి మీరు ప్రత్యక్ష సాక్షిలాగా కనిపిస్తున్నారు'' అన్నాను. అతను అడుగు వెనక్కి వేసి నావైపు చూసి ''ఎలా ఊహించారు'' అన్నాడు.

''వ్యక్తీకరించడానికి వీలులేని ఏదో ఓ బాధ మీ గొంతులో ఉంది'' అన్నాను.

నోట్లోని లాలాజలాన్ని మింగేస్తూ నా తోటి ప్రయాణికుడు ''అవును... ఆ...'' అతను ఓ బూతును వాడబోయి ఆగి ''అమరవీరుడైన అన్నయ్య పేరుపై వాళ్ళు ఓ మచ్చ'' అన్నాడు. ఇది చెబుతూ అతను ప్లాట్‌ఫాం దిగాడు. ★

